

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## గుం.గు స్వామి

నా చద్దెన్నం మూట, లాప్ టాప్ తట్టా పుచ్చుకుని ఏరువాక సాగడానికి కారెక్కబోతుంటే చెప్పింది

**" సాయంత్రం కాస్త త్వరగా రండి" .**

అప్రయత్నంగా నోట్లోంచి విషెస్ బైటికొచ్చేసాయి...

**"విష్ యూ హేపీ..."**

అంతే, అక్కడ నోరు ఆగిపోయి మన బుర్ర ఆలోచించడం మొదలెట్టేసింది. ఇవాళ..నా బర్త్‌డే కాదే, ఆవిడ బర్త్‌డేనా? కాదే, అది ఆల్‌రెడీ తామ్ర ఫలకం మీద అచ్చేయించి మంచం పక్కన పెట్టేసుకున్నాను కదా, మర్చిపోతే కొంపలంటుకుంటాయని. మరి..పిల్ల దా, కాదే, దానికి వారం రోజుల ముందునించీ మొదలవుతుంది కదా కౌంట్‌డౌను..మరేవిటి? తల్లుల దినము, తండ్రులదినమూ, మా వివాహ వార్షికోత్సవమూ కాదే. కనీసం అట్లతద్దన్నా కాదే. మరేవిటి. ఇంక ఆలోచన ఆపి

**"అంటే హేపీ వరల్డ్ పీస్ డే అన్నమాట.."** అన్నాను ఇబ్బందిగా నవ్వుతూ.

**"వరల్డ్ పీసూ లేదు, కొబ్బరి పీచూ లేదు, త్వరగా ఊడిపడండి చాలు, అన్నట్టిదిగో, వచ్చేప్పుడు పూలట్టుకురండి, కాస్త మంచివి చూసి."**

ఇంక నాకర్థమైపోయింది. **సమఝ్ దార్ కో ఇషారా " కాఫీ " హై, " టీ " భీ హై..** అందుకే వెంఠనే అడిగేసా..

**"మరి మన పిల్లనేంచేద్దాం"** అని కొంటెగా.

**"అత్తారింటికి పంపించేద్దాం, మీకెప్పుడూ "** ***అదే*** **" రంధి, నేను రమ్మన్నది పూజకి"** అంది చిరు కోపంతో.

**"పూజా, ఎవరికీ, ఎవరింట్లో?"** కాస్త అనుమానంగా అన్నాను కారు స్టార్ట్ చేస్తూ.

**"స్వయం ప్రకాష్ గారింట్లో. ఇవాళ గుండుగుల స్వామీజీ వస్తున్నారు, మన్ని రమ్మన్నారు, భజనకీ, పూజకీని. భోజనాలు కూడా తెప్పిస్తున్నారట వందమందికి. "**

అంతే, ఆ చివరి ముక్క చెవినపడ్డ తరవాత, ముందువన్నీ మర్చిపోయి, **"వో.ఖే అలాగే వచ్చేస్తా.."** అంటూ కారెక్కి తుర్రుమన్నాను.

ఆఫీసు కెళ్ళాకా కంప్యూటర్ లో **గూగుల్** చేసా **"గుండు గుల స్వామి"** అని. బోలెడంత ఇన్ఫర్మేషనొచ్చింది. ఒక బోడి గుండు, పాచి నవ్వు తో యంగ్ అండ్ డైనమిక్ స్వామీజీలా వున్నాడు కాండిడేటు. అన్ని రకాల ప్రొఫైల్ షాట్స్ లోనూ ఆయన్ని చూసి తరించి, **"** ***" గుండు"*** **వరకూ నిజమే. మిగితా రెండక్షరాలగురించే తేలాలి, "** అని నవ్వుకుంటూండగా, ప్రకాష్ ఫోను.

**" అంతా వోకే కదా.." .**

నాకర్థం కాలేదు. ఎందుకేనా మంచిదని జిప్పు పెట్టుకున్నానో లేదో చూసుకుని..

**"ఆ,ఆ, వో.కే..ఇంకేం భయం లేదు "** అనేసాను.

**"అదికాదు , సాయంత్రం వస్తున్నావు కదా, ఛా..లా....మహిమ గల స్వామీజీ. ఇండియాలో దర్శనమే దొరకదు, మనింట్లో పాద పూజ, భజనకి ఒప్పుకున్నారంటే అది మన కంబైండ్ అదృష్టం అన్నమాట..,**
**నువ్వొచ్చి ఓ పాటన్నా పాడాలి, ఉంటాను. "** ఫోనుకట్టు.

సీను కట్ చేస్తే , సాయంత్రం నేనూ, మా పిల్లా, ఇల్లాలూ వాళ్ళింటిముందున్నాం, పూలట్టుకుని. ఎక్కడచూసినా చెప్పులే.

మాపిల్ల **"నాన్నా, నెక్స్ట్ వీక్ నాకు ఇల్లాంటి పింక్ చెప్పులు కొను"** అంది ఒక జత చూపిస్తూ.

**"అలాగే తల్లీ"** అన్నాను **వారం గేప్** ఇచ్చినందుకు సంతోషిస్తూ. ఇంతలో ఆ ఇల్లుగలావిడ వచ్చి మా ఆవిణ్ణీ, పిల్లనీ లోపలికి లాక్కెళ్ళిపోయింది, ఆప్యాయంగా. నేను చెప్పులు కలిసిపోకుండా ఓ మూల పెట్టి, ఎంట్రీ ఇచ్చాను. లోపల ఆడాళ్ళంతా ఓవేపు, మగాళ్ళంతా ఓవేపు. మధ్యలో ఎదురుగా ఓ పే...ద్ద ఖాళీ కుర్చీ. స్వామి ఇంకా మేడ దిగలేదుట. ఇల్లంతా అగరత్తుల పొగ. అంత హడావిడిలోనూ నా దృష్టి కిచెన్‌లో డైనింగ్ టేబుల్ మీద పడింది. సుమారు పన్నెండు పెద్దట్రేలు, నాలుగు మీడియం ట్రేలు.

**"అబ్బో, ఎపటైజరూ, రైతా, రెండు స్వీట్లూ కూడాను, పర్లేదు కిట్టుబాటవుతుంది.."** అనుకుంది నా చిన్ని బొజ్జ. ఇంతలో అందరూ ఒక్క పెట్టున **"గుండుగుల మహరాజ్‌కీ జై"** అంటూ కేక పెట్టారు. నేను మళ్ళీ అటెన్షన్ లోకొచ్చేసరికి స్వామి సీటు ఆక్రమించేసారు.

అప్పుడు ప్రకాషూ, వాళ్ళావిడా, స్వామి చుట్టూ పన్నెండు ప్రదక్షిణలు చేసి ఓవారగా కాళ్ళదగ్గిర కూర్చున్నారు భక్తితో వణికిపోతూ. ఒక భక్తుడులేచి **"గుండుగుల లో వెలసిన దేవా, మా పాలిటి దైవము నీవా (?) రాముడు నీవా, కృష్ణుడు నీవా, వారెవా వారెవా వహ్వారే వారెవా.."** అంటూ అంత్యప్రాసలో ఆయాసపడిపోయాడు. స్వామి జాలీగా కాళ్ళూపుకుంటూ, కుర్చీలో ఊగుతూ, వీలున్నప్పుడు ప్రకాష్‌నీ ఆయన అర్ధాంగినీ **తంతూ,** మహదానంద పడిపోతున్నారు. కాళ్ళు తగిలినప్పుడల్లా పులకించిపోతున్నారు ప్రకాష్ అండ్ కో. ఈ **" తంతు"** ఓ పావుగంట నడిచేసరికి స్వామి ఫోను మోగింది. ఆయన విలాసంగా చిల్కు లాల్చీలోంచి ఫోను బైటికి లాగి...

**"ఆ, మంత్రి గారా ? అయిదు నిమిషాలు లైన్లో వెయిట్ చెయ్యమను.."** అనేసి ఫోను పక్కన పడేసి, కాళ్ళూపడం కన్టిన్యూ చేసారు.

మళ్ళీ కాసేపయ్యాకా ఫోనెత్తి..**"నేను బిజీగా ఉన్నాను. ఓ నాల్రోజులాగి చెయ్యండి.."** అనేసి పెట్టేసారు.

భక్తులందరూ నోళ్ళు వెళ్ళబెట్టుకుని చూసారా దృశ్యాన్ని. కాసేపయ్యాకా ప్రసంగం..

**" మనం ఓంకారంలోంచి పుట్టాం. ఓంకారం ఇప్పుడు మనలోంచి పుట్టింది, ఇలా ఒకదానిలోంచి ఒకటి పుట్టడమే సృష్టిలో తమాషా. పుట్టిన ప్రతీవాడు చదువుకోవాలి, ఆడుకోవాలి, స్కూలు కెళ్ళాలి, కాలేజీ కెళ్ళాలి, ఉద్యోగం చెయ్యాలి, రిటైరవ్వాలి. ఇలా, ఇలా చాలా చెయ్యాలి. ఇవన్నీ ఒక చోట చేసేందుకు వీలుగా, సుమారు పదివేల ఎకరాల భూమిని మనం మన గుండుగుల గ్రామం చుట్టూ డెవలప్ చేస్తున్నాం. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఫేజ్ వన్‌లో ఉంది. ఇప్పుడు కొంటే మీకు స్థలమైనా, త్రీ బెడ్ రూం ఫ్లాటయినా చాలా చవకగా సగం ధరకే వస్తుంది. ఆనక అమ్ముకున్నా బోల్డు లాభవొస్తుంది. "**

అంటూ ప్రకాష్ కేసి చూసారు. అతను వెంఠనే లాప్‌టాప్‌లో ఓ పదినిముషాలు పవర్ పాయింట్ ప్రెజెంటేషనిచ్చేసాడు. ఈ వ్యాపారంలో ఆరితేరిన శాస్త్రీలు, మంత్రులూ, గూండాల చిరునవ్వుల ఫొటోలన్నీ కలిపి తయారుచేసిన ప్రెజెంటేషను అది. అది ఇలా పూర్తయిందో లేదో, నలుగురు భక్తులు సైన్ అప్ చేసేసారు. మిగిలినవాళ్ళు ఊగుతున్నారు.

**"ఎవరికేనా సందేహాలుంటే అడగండి.."** అన్నారు స్వామీజీ.

**" అంటే, ఇది అసైన్డ్ లాండా? లేకపోతే మీకు ఆల్‌రెడీ ఇచ్చేసిన లాండా స్వామీ?"** అడిగాను నేను అమాయకంగా.

**"మూర్ఖప్రశ్న. మేం అడగమన్నవి ధర్మ సందేహాలు.."** అన్నారు స్వామి మొహం చిట్లించి.

వెంఠనే ఒక ముతా భక్తురాలు అడిగింది. **"స్వామీ, నేను అంటే ఎవరు స్వామీ?"**

**"నేను అంటే, "నే.ను..", నీలోనూ నేనే, నాలోనూ నేనే. "** అన్నారు స్వామి చిరు మందహాసంతో.

**"అద్భుతం స్వామీ.."** అందావిడ దణ్ణాలు పెడుతూ.

మరో భక్తుడు అడిగాడు.." **స్వామీ, నిన్న సుమారు ఈ వేళకి ఎంత సమయం అయ్యుంటుం దంటారు?"**

స్వామి తీరికగా డైమండు రొస్టు వాచీ, ఐ మీన్ రిస్టు వాచీ చూసి, **"నిన్న ఈ సమయానికి సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలయ్యుంటుంది. ఇవాళా అంతే అయింది , రేపూ అంతే అవుతుంది.."** అన్నారు గంభీరంగా.

**"అయ్యబాబోయ్, స్వామీ మీరు మహాద్భుతంగా చెప్పారు. కాలదర్శి గుండుగుల స్వామికీ జై"** పేద్ద అరుపు అరిచి సాష్టాంగ పడిపోయాడా భక్తుడు.

నాలుగు నిమిషాల తరవాత ఐదుగురు సాయంపట్టి ఆయన్ని లేవతీసారు. స్వామీజీ చూపులు ఆడ గ్రూపు మీదే ఎక్కువ ప్రసరిస్తున్నట్టు గ్రహించాను. నాకొళ్ళు మండిపోతోంది. ఇంతలో మా ఫ్రెండు బలవంతపెట్టేసాడు **"రాముడి"** మీద ఓ పాట పాడమని. నేనందుకున్నాను **"సీతారాం సీతారాం, సీతారాం జయ సీతారాం, పైన పటారం లోన లొటారం ఈ జగమంతా డంబాచారం"**. అందరూ కలిసి, మీదపడి నా నోరునొక్కేసారు హారతి టైమైపోయిందంటూ..

పిమ్మట ***" ఓం జగదీశ హరే, స్వామి గుండుగుల హరే, ప్లాటులు అమ్మే స్వామీ, మా పాట్లు తీర్చే స్వామీ, హారతి గైకొనుమా, ఓం గుండుగులా దేవా.."*** అంటూ **కష్టమైజ్‌డ్** హారతయ్యేసరికి నాకు తట్టుకోవడం **కష్టమై** పోయి శోషవచ్చింది.

హారతి పూర్తవంగానే స్వామి మేడమీదకి జంపు. ఆడాళ్ళంతా లైను కట్టేసారు మెట్లమీంచి కిచెన్ లోపలి దాకా. నాకర్థం కాలేదు. అందరూ గుసగుస లాడుకుంటున్నారు ***"ఏకాంతసేవ, ఏకాంతసేవ"*** అంటూ.

ప్రకాష్ని పిలిచి అడిగా.. **"ఏ "కాంత" సేవ" ?** అని.

**" అందరూనూ "** అన్నాడు ప్రకాష్. నేను అనుమానంగా చూసాను.

**"వెధవ అనుమానాలు మాను, స్వామీజీకి సేవచేస్తే కోరికలు తీరతాయి. పిల్లలు పుడతారు.."**అన్నాడు ఎంతో రహస్యంగా.

**"ఎవరికీ?.."** అని అడిగాను అంతే రహస్యంగా.

నాకేసి ఓ పిచ్చి చూపు చూసి, డాబా మీద క్రౌడుని కంట్రోల్ చెయ్యడానికెళిపోయాడు ప్రకాషు. మగాళ్ళంతా తిండిమీద పడ్డారు. స్వామీజీకోసం వేరే గిన్నెల్లో మూతపెట్టి ఉంచారు మడిగా, ఆయన రాత్రి లేటుగా తింటారట. ఏదో తింటున్నానన్న మాటే గానీ, దృష్టంతా లైన్‌లో నించున్న మా ఆవిడమీదే ఉంది. పిల్ల అప్పుడే బేస్మెంట్లో కెళిపోయి ఆటలు మొదలెట్టింది కాబట్టి భయంలేదు. ఇంటావిడ వచ్చి అడిగింది **"ఏవిటి, ఇబ్బందిగా ఉన్నారు.., బిరియానీ బాగా చేసాడా, లేదా?"** .

**"అదికాదండీ, నాకు కాస్త అజీర్ణంగా అనిపిస్తేనూ.."** అన్నాను నసుగుతూ.

ఆవిడ రెండునిమిషాలు లోపలికెళ్ళి రెండు టాబ్లెట్లు తెచ్చిచ్చింది. **" వీకెండే కాబట్టి రేపొకటీ, ఎల్లుండొకటీ వేసుకోండి, మొత్తం కడుపు క్లీనయిపోతుంది. జాగ్రత్త, రోజుకొకటే.."** అనేసి వెళ్ళిపోయింది.

ఇంతలో మా ఆవిడ పైన రూంలోకెళ్ళిపోయింది. నా చేతిలో ప్లేటు వణుకుతోంది. **ఐదు, ఆరు, ఏడు...ఐబాబోయ్.. ఏడు నిముషాలు...హమ్మయ్య వచ్చేసింది.** ***మా ఆవిడ రాక కోసం అంతల్లా ఎదురుచూసిన రెండో సందర్భం అది.*** ఎనీవే, వెంఠనే పూర్ణకుంభంతో ఎదురెళ్ళి మా ఆవిణ్ణి కిందకి తీసుకొచ్చి అడిగాను సంగతేవిటని. ఇంటికెళ్ళాకా చెబుతానంది. కూడదు ఇప్పుడే చెప్పు, ఈ టెన్షన్‌తో ఇంటికెళ్ళేలోపే బాల్చీ తన్నేసేలా వున్నానన్నాను. ఎవరికీ వినపడకండా మెల్లిగా మొదలెట్టింది..**" నేను పైకెళ్ళి పాద పూజ కోసం పూలు వేసాను. అప్పుడు మొదలెట్టారు " నేను పూర్వ జన్మలో ఆయన శిష్యురాలినిట. నా పేరు వాసంతిట. అందుకే మళ్ళీ ఇప్పుడు కలిసామట. అంతకు ముందు జన్మలో నేను ఆవు, మీరు కుక్కట "** అంది నవ్వాపుకుంటూ.

నాకొళ్ళుమండి చేతిలో పేపరు ప్లేటు అవతల పారేసి, పెద్ద కప్పులో నాలుగు **గులాబ్‌జాం**లు వేసుకుని..**"ఈ గులగాడికి నాచేతిలో మూడింది, ఇవాళ వాడి గుండు గులాబ్‌జామే.....ఇంకేమన్నాడో చెప్పు..."** అన్నాను క్రూరంగా.

**"నా పాదాలమీదే దృష్టి పెట్టు"** అన్నారు.

**"సంతోషం, అక్కడితో ఆపాడు.."** అన్నాను నేను కోపంగా.

**"అన్నట్టు మళ్ళీ రేపు ఉదయం ప్రభాత సేవకి వేరే వాళ్ళతో బాటు నన్ను రమ్మని మరీ మరీ చెప్పారు,రానేవిటీ పోనీ.."** అంది నన్ను ఉడికిస్తూ.

నాకొళ్ళు మండిపోయి **"ఐపోయాడు, రేపు వీడు లేస్తే కదా, ప్రభాత సేవా, గాడిద గుడ్డూను."** అనుకుని

**"సంతోషించాం. ఆయన ఇంకా మేసాడా లేదా? "** అన్నాను చిరాగ్గా.

**"నన్ను తీసుకురమ్మన్నారు ఫుడ్డు "** అంది తెగ నవ్వుతూ.

వెంఠనే వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టయింది. నేను స్వయంగా గిన్నెలు తీసుకొచ్చి మా ఆవిడచేత పైకి పంపించాను.

**"అన్నీ అక్కడ పెట్టేసి వెంఠనే వచ్చేయ్, ప్రభాతసేవకి వస్తానని చెప్పు, లేకపోతే తిండి కూడా మానేస్తాడు పక్షి.."** అని.

మా ఆవిడ ఇన్స్ట్రక్షన్స్ అన్నీ ఫాలో అయిపోయింది. రాత్రి ఇల్లు చేరేసరికి పన్నెండు. మర్నాట్నించీ ఆవిషయం నేను మర్చిపోదావన్నా, మా ఆవిడ తలుచుకు తలుచుకు మరీ నవ్వుకుంది, నన్ను తెగ ఉడికించసాగింది. రెండ్రోజులు పోయాకా ప్రకాష్ ఫోను. పాపం స్వామీజీకి ఉన్నట్టుండి పాసనాలు పట్టుకున్నాయిట. నాలుగ్గెంటల్లో అరవైనాలుగు సార్లు ఝూడించేసరికి, ఆయన్ని కిందబెట్టేసారట. ఇక్కడ ఇన్సూరెన్సు లేదని అర్జెంటుగా రాత్రికి రాత్రి ఫస్టు అవైలబుల్ ఫ్లైటులో ఇండియా రవాణా చేసేసారుట. అదీ సారాంశః. ఇవన్నీ విన్నాకా మా ఆవిడకి అనుమానం రానే వచ్చింది. **"ఇది మరీ బావుంది, గంగి గోవు లాంటి వాణ్ణి, నాకేం తెలియదు"** అని అడ్డంగా బుకాయించేసాను.

***అయినా మనలో మన మాట, ఆ దిక్కుమాలిన టాబ్లెట్లు అంత పవర్‌ఫుల్ అని నిజంగానే నాకు తెలియదు సుమీ.***

ఈనెల ఎపిసోడ్ ఐపోయింది కానీ..ఇంకొక్క మాట చెప్పాలండోయ్.. తర్వాత పేజీ చదివెయ్యండి మరి..!

"ఎవడ్రానువ్వు?"

*"అంటే..వుప్పుడు,రెండేళ్ళక్రితం వచ్చినప్పుడు "ఎవడ్రానువ్వు " అని అడిగారు చూడండి, వాణ్ణేనండి."*

"కాపీ జోకులకేంగానీ, కథేంటో చెప్పు.."

*"కథలూ, కబుర్లూ, కాదండి, ఈ సారి కాకరకాయలు.."*

"అబ్బో, పేరేం పెట్టేవేటి?

*"టేకిట్ ఈజీ అండి.."*

"తెలుగు పేరు దొరకలేదా?"

*"అంటే.. స్టయిలు గుంటది కదండి మరి.."*

"ఓర్నీ స్టయిలూడదొబ్బ , ఇంతకీ కితం పుత్తకానికేమాత్రం సంపాదించావేవిటి?"

*"మైనస్ ఎనిమిదొందలండి..."*

"రూపాయిలే..?"

*"డాలర్లండి.."*

"ఇంకా తీరలేదా బులపాటం?"

*"ఓ పూట అన్నం మానేసి అర్టిపండు తినేద్దారని డిసైడయ్యానండి.."*

"నిన్నా దేవుడు కూడా బాగుచేయలేడు రా .."

*"మరేనండి .."*

కాబట్టి ఇందు మూలముగా తెలియజేయున దేమనగా... మీరింతకాలమూ గోళ్ళు కొరుక్కుంటూ చదివిన టేకిటీజీ, ఇకపై పుస్తకముగా తీసుకుని వచ్చుటకు దైవజ్ఞులు నిశ్చయించినారు గాన, కొత్త సమచ్ఛరములో అపుడో, ఇపుడో, ఎపుడో టేకిటీజీ 24 ఎపిసోడ్ల పుస్తకముగా మీ ముందుకు వచ్చును. మీరు కాపీలు రిజర్వు చేసుకోదలచినచో, మాకు రాయుడి. ఇవియే అనేక శుభలేఖార్థములు. ఈ మెయిలు: ఫణిడొక్కా ఎట్ యాహూ డాట్ కాం.

(ఒహోం ఒహోం హోం ఒహోం ఒహోం...)

**NEW**
Click here to share your comments on this story